న్యూస్‌రీల్

అగ్నిపథ్‌కు ఉచిత శిక్షణ

పార్వతీపురం: అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీలో ఉద్యోగాల సాధనకు విజయనగరంలోని రాజీవ్ స్పోర్ట్స్ స్టేడియంలో 40 రోజులపాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్టు యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి బి.రామ్‌గోపా ల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో దరఖాస్తు చేసుకున్న యువత ఈనెల 10న(శనివారం) విజయనగరంలో జరిగే ఉచిత రెసిడెన్సియల్ శిక్షణకు హాజరుకావాలని కోరారు. అగ్నివీర్ (ఆర్మీ) రిక్రూట్‌మెంట్ ర్యాలీని జూలై 20 నుంచి ఆగస్టు 2 వరకు విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో జరగనుందన్నారు. శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఆర్టీల రెన్యువల్‌కు జీఓ విడుదల

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలను రెన్యువల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 195 ను శుక్రవారం జారీ చేసిందని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిక భాస్కరరావు, కుండంగి కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి సీతంపేట ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లను కూడా రెన్యూవల్ చేసేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం



ఎం.పెంటయ్య

పార్వతీపురం టౌన్: మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలల్లో ఖాళీల భర్తీకి అర్హులైన విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎం.పెంటయ్య శుక్రవారం కోరారు. సాలూరు బాలికల పాఠశాలలో ఆరో తరగతిలో 4 ఖాళీలు, పార్వతీపురం బాలికల పాఠశాలలో ఆరో తరగతిలో 14, 9వ తరగతిలో 2 ఖాళీలు, కురుపాం బాలుర పాఠశాలలో ఆరో తరగతిలో 24, 7వ తరగతిలో 8 ఖాళీలు, 8వ తరగతిలో 24 ఖాళీలు, 9వ తరగతిలో 6 ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 18 తేదీన జరిగే రాత పరీక్ష ద్వారా ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

అభినందనల జల్లు



తరుణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాలకొండ: ఏపీఆర్‌డీసీ పరీక్ష ఫలితాల్లో పాలకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి మంగి తరుణ్ రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంకు సాధించాడు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ మాచర్ల కుమారస్వామి, ఎస్ఎస్ఎస్ పీఓ వెలమల అప్పారావు, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు. జ్ఞాపికను బహూకరించారు.

విధులకు డుమ్మాకొట్టిన ఉద్యోగులపై చర్యలు

- ఇద్దరు ఉద్యోగుల జీతాలు నిలుపుదలకు కలెక్టర్ ఆదేశం



బత్తిలి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

భామిని: మండలంలోని బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ నిషాంత్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. విధులకు డుమ్మాకొట్టిన జూనియర్ అసిస్టెంట్ శశికాంత్ బహదూర్, నైట్ వాచ్‌మన్ వెంకటరావుపై చర్యలకు ఉపక్రమించారు. జీతాలు నిలిపివేయాలని ఆదేశించారు. గత ఆరు నెలల్లో కేవలం 15 కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారి రవీంద్రకు సూచించారు.

చోరీ కేసులో విద్యార్థి అరెస్ట్

సాలూరు: చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్టు సాలూరు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మెంటాడవీధికి చెందిన మల్లు నాయుడు ఇంటిలో వివిధ సందర్భాల్లో సుమారు 300 గ్రాముల బంగారం పోవడంతో, బాధితులు ఫిర్యాదు చేశారు. వారికి పరిచయస్తుడైన దత్తిరాజేరు మండలం పి.లింగాలవలస గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి నేలబోని దుర్గాప్రసాద్‌పై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా... పలుమార్లు ఇంటిలో ఉన్న బంగారం తీసుకుని, పట్టణంలోని ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ సంస్థలో తనఖాపెట్టినట్లు ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇంటికే పౌష్టికాహారం

- వచ్చేనెల 1 నుంచి అమలు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఇళ్లకు పౌష్టికాహారం పంపిణీకి ప్రభుత్వం చర్యలు
- రెండు విడతల్లో పంపిణీకి ఏర్పాట్లు
- జిల్లాలో 2,064 అంగన్‌వాడీ కేంద్రాలు
- 6,088 మంది గర్భిణులు, 7,128 మంది బాలింతలకు లబ్ధి



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేస్తున్న అధికారులు (ఫైల్)

పార్వతీపురంటౌన్:

మాతాశిశు సంరక్షణపై జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న కిట్ల రూపంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత నివారించేలా వైద్యసేవలతో పాటు పౌష్టికాహారాన్ని సమకూర్చుతోంది. వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రుచికరమైన ఆహారాన్ని వడ్డిస్తోంది. అయితే, కొందరికి అంగన్‌వాడీ కేంద్రాలు దూరంగా ఉండడం, రాకపోకలకు బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతుండడాన్ని ప్రభుత్వం గుర్తించింది. వారి కోరిక మేరకు లబ్ధిదారుల సంక్షేమమే ధ్యేయంగా భావించి జూలై ఒకటో తేదీ నుంచి ఇంటికే పౌష్టికాహారం ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిన ఆహారానికి బదులుగా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంపై బాలింతలు, గర్భిణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతమందికి ప్రయోజనం?

పార్వతీపురం మన్యం జిల్లాలో 2,064 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. ఇందులో గిరిజన గ్రామాల్లో 1116, రూరల్ పరిధిలో 759, పట్టణాల పరిధిలో 189 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 31,879 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 25,674 మంది ఉన్నారు. జిల్లాలో 6,088 మంది గర్భిణులు, 7,127 మంది బాలింతలు ఉన్నారు. వీరందరికీ ఇళ్ల వద్దకే రేషన్ అందజేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై గిరిశిఖర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సరుకుల పంపిణీ ఇలా...

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో నమోదైన గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహార సరుకులను ఇంటికే సరఫరా చేస్తారు. నెలకు మూడు కేజీల బియ్యం, కిలో కంది పప్పు, అరకేజీ నూనె, 25 కోడిగుడ్లు, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగి పిండి, కిలో అటుకులు, 250 గ్రాముల ఖర్జూరం, పావుకిలో బెల్లం, 250 గ్రాముల చిక్కీలు జగనన్న కిట్ ద్వారా పంపిణీ చేస్తారు. 7 నెలల నుంచి 36 నెలల లోపు చిన్నారులకు నెలకు 2.5 లీటర్ల పాలు, 2.5 కిలోల బాలామృతం, 25 కోడిగుడ్లను ఇంటి వద్దకే ఇస్తారు. ప్రీస్కూల్ పిల్లలకు రోజూ కేంద్రాల్లో 100 మి.లీ పాలు, కోడిగుడ్డు ఇస్తారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిన ఆహారాన్ని అందించేవారు. కేంద్రానికి అర కిలోమీటరు పైబడి దూరంలో ఉన్న గర్భిణులు, బాలింతలు రావడానికి ఇబ్బంది పడేవారు. వర్షాకాలంలో కేంద్రాలకు రావడం మరింత కష్టంగా ఉండేది. ప్రభుత్వం స్పందించి ఇంటికే సరకులు అందించడం సంతోషంగా ఉంది. మా బాధల్ని ప్రభుత్వం అర్థం చేసుకున్నందుకు ధన్యవాదాలు. జగనన్న పాలనలో అన్నీ మంచి నిర్ణయాలే.

– ఎస్.మానస, బాలింత, పాలకొండ

రెండు విడతల్లో అందజేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ప్రభుత్వం వండి పెడుతున్న ఆహారానికి బదులుగా టీహెచ్‌ఆర్ ఇవ్వాలని నిర్ణయించింది. జూలై ఒకటి నుంచి ఇది అమలవుతుంది. ఒకటి నుంచి 5వ తేదీలోపు మొదటి విడతగా, 16, 17 తేదీల్లో రెండో విడతగా సరకులు అందజేస్తాం.

– కె.విజయగౌరి, ఐసీడీఎస్ పీడీ, పార్వతీపురం మన్యం

● జగనన్నే మా భవిష్యత్తు

కాంట్రాక్టు ఉద్యోగుల దశాబ్దాల కలను జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నెరవేర్చింది. సర్వీసు క్రమబద్ధీకరణకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలపడంతో ఉద్యోగులు సంబరాలు చేసుకుంటున్నారు. విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బంది శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ఫ్లెక్సీలు ప్రదర్శించారు. జై జగన్ అంటూ నినదించారు. ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

–సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న పారామెడికల్ సిబ్బంది



జగనన్నకు జై అంటూ నినదిస్తున్న కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బంది

ఎండీఎం మెటీరియల్ తీసుకోవాలి

పార్వతీపురం: పాఠశాలలు ఈ నెల 12న పునః ప్రారంభం అవుతున్న తరుణంలో జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం, రాగిపిండి, బెల్లం పౌడర్‌ను శనివారం సాయంత్రంలోగా ఎండీఎం వాహనం నుంచి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలు పునః ప్రారంభం నాటికి మధ్యాహ్న భోజనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని హెచ్‌ఎంలను ఆదేశించారు.

సాలూరులో పులి సంచారం

- ఆవును హతమార్చిన బెబ్బులి



పులిదాడిచేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

సాలూరు: సాలూరు పరిసరాల్లో పెద్దపులి సంచరిస్తోంది. పట్టణానికి కూతవేటు దూరంలోని గుమడాం సమీపంలో పామాయిల్ తోటలో కట్టిన రైతు రాంప్రసాద్‌కు చెందిన ఆవుపై గురువారం రాత్రి దాడిచేసి హతమార్చింది. ఉదయం ఆవు కళేబరాన్ని చూసిన రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. ఫారెస్ట్ రేంజర్ రామారావు ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. పాదముద్రలను సేకరించారు. మగపులి సంచరిస్తున్నట్టు నిర్ధారించారు. సాలూరు, మక్కువ, బొబ్బిలి, పాచిపెంట ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తోటల్లో ఆవులు ఉంచరాదని దండోరా వేయించారు. రాత్రివేళల్లో రాకపోకలు చేయొద్దని కోరారు.



మరో 4 రోజులు భగభగలు

- విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఉష్ణతాపం
- ఎండలో తిరగొద్దంటూ హెచ్చరికలు

విజయనగరం అర్బన్: వేసవి ఎండల తీవ్రత మరో నాలుగు రోజుపాటు ఉమ్మడి విజయనగరం జిల్లాలో కొనసాగనుందని రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లో వేపాడ, తెర్లాం, విజయనగరం మండలాలు మినహా మిగిలిన 24 మండలాల్లోను, పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో సాలూరు, సీతానగరం మండలాలు మినహా మిగిలిన 13 మండలాల్లో ఈ నెల 10, 11, 12, 13 తేదీల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుందని ప్రమాదకర సూచిక జారీచేసింది. వీరఘట్టం మండలంలో 10వ తేదీన, జియ్యమ్మవలస మండలంలో 13వ తేదీన 45 డిగ్రీల కు దాటి ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. జిల్లా వాసులను అప్రమత్తం చేయాలని జిల్లా యంత్రాంగానికి హెచ్చరికలు జారీ చేసింది.



12న డీఈఈ సెట్

- పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు



మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు

విజయనగరం అర్బన్: డైట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 12న జరిగే డీఈఈ సెట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. డీఈఈ సెట్ ఏర్పాట్లపై తన చాంబర్‌లో శుక్రవారం సమీక్షించారు. సోమవారం ఉదయం 10 నుంచి 12.30 గంటల మధ్య సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని అయాన్ డిజిటల్ సెంటర్‌లో విజయనగరం ఉమ్మడి జిల్లాకు చెందిన 175 మంది పరీక్ష రాయనున్నట్టు వెల్లడించారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే పరీక్షకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రానికి చేరుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ లక్ష్మీకుమారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ దేవ్‌ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం

బలిజిపేట:

ఆ ప్రాంత వాసుల దశాబ్దాల కల నెరవేరింది. రాకపోకల కష్టాలు తొలగిపోయే రోడ్డు అక్కరకు రావడంతో అభిమానం ఉప్పొంగింది. ఎమ్మెల్యేకు పూలు, క్షీరాభిషేకాలతో పి.చాకరాపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని పి.చాకరాపల్లి- అజ్జాడ రోడ్డు నిర్మాణానికి పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషితో రూ.2.80 కోట్లు మంజూరైంది. రోడ్డు పనులు పూర్తికావడంతో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా... అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషిచేస్తోందన్నారు. పేదల జీవన ఉన్నతికి పాటుపడుతోందని తెలిపారు. రూపాయి అవినీతిలేకుండా సంక్షేమ పథకాల నిధులన్నీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తున్నట్టు వెల్లడించారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇచ్చే మోసపూరిత హామీలను నమ్మొద్దన్నారు. ఒక గ్రామ సర్పంచ్ కార్యోన్ముఖుడయితే రోడ్డు నిర్మాణం వంటివి త్వరగా పూర్తవుతాయనేందుకు సర్పంచ్ మోహనరావు నిలువెత్తు నిదర్శనమన్నారు. 4.5 కిలోమీటర్ల పొడవున నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే జోగారావుకు సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు బాజాభజంత్రీలతో స్వాగతం పలికారు. రోడ్డు కష్టాలు తీర్చేనాయకుడు వచ్చాడంటూ అశ్వరథంపై ఊరేగింపుచేశారు.

మహిళలు దారిపొడవునా హారతులు పట్టారు. సర్పంచ్ ఇంటివద్ద ఎమ్మెల్యేకు పాలతో అభిషేకం జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఎంపీపీ నాగమణి, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్‌లు సుందరరావు, విజయ, ఆర్.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు రాజమోహన్, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు దుర్గేశ్వరి, పలగర సహకార సంఘం అధ్యక్షుడు పకీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.



పి.చాకరాపల్లి-అజ్జాడ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యే జోగారావును పాలతో అభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఏకలవ్య భవనాల పరిశీలన



ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలపై ఈఈకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

భామిని: ఏకలవ్య మోడల్ స్కూల్ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ కె.నిషాంత్‌కుమార్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. భామిని మండల కేంద్రంలోని 12 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.12 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ స్కూల్ భవనాల నిర్మాణాలను నిశితంగా పరిశీలించారు. నిర్మాణంలో నిలిచిన తరగతి గదులు, హాస్టల్, డార్మిటరీ భవనాలు సందర్శించారు. గుర్తింపు పొందిన కంపెనీల విద్యుత్ పరికరాలు, శానిటేషన్ పరికరాలు మాత్రమే ఉపయోగించాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఈ సింహాచలంకు సూచించారు. జూలై నాటికి ఏకలవ్య పాఠశాల నూతన భవనాలు పూర్తిచేసి తరగతుల నిర్వహణకు అప్పగించాలని ఆదేశించారు. ఏకలవ్య పాఠశాల చుట్టు ప్రహరీ నిర్మాణానికి, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు కేటాయించాలని ఈఈకు సూచించారు. దీనికి అనుగుణంగా ఆదేశాలిస్తామని చెప్పారు. కలెక్టర్ వెంట డీఈఈ కృష్ణకుమార్, తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఏపీఓ ఇ.తులసీదాస్, ఎంపీడీఓ గుండేల చంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు

- వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌కు అత్యంత ప్రాధాన్యం
- చెత్త నుంచి ఎరువులు తయారు చేయాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి ఆయా శాఖలకు అప్పగించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. చిన్నచిన్న పనులు, పెండింగ్‌లో ఉన్న భవనాలను 15 రోజుల్లో పూర్తిచేయాలన్నారు. భవన నిర్మాణాల పురోగతిపై ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సమీక్షించారు. ఆన్‌లైన్‌లో భవన నిర్మాణాలు పూర్తయినట్టు చూపించారంటే వినియోగానికి సిద్ధంగా ఉన్నట్టు భావించాలన్నారు. నిర్మాణాలు పూర్తికాకుండా పూర్తిచేసినట్టు అప్‌లోడ్‌చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు పూర్తయిన భవనాల ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులతో మాట్లాడి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ ఏడాది విత్తనాలు, ఎరువులు 50 శాతం వరకు ఆర్‌బీకేల ద్వారానే సరఫరా చేస్తామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించేందుకు వీలుగా హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ ఏడాది జిల్లాలో 45 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి అనుమతి వచ్చిందని, జనాభా ప్రాతిపదికన నివేదికలు అందజేయాలని కోరారు. నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధిహామీ నిధులతో చేపట్టే భవన నిర్మాణాలకు నిధుల సమస్య ఉండదన్నారు. నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లుల అప్‌లోడ్ చేయాలన్నారు. వచ్చే 15 రోజుల్లో ఏఏ పనులు చేస్తారో చెప్పాలని, నోట్ చేసుకొని మీరు చెప్పిన విధంగానే 15 రోజుల తర్వాత సమీక్షిస్తానని, అప్పటికీ చెప్పినవన్నీ పూర్తిచేయాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప్‌లో భాగంగా ఘనవ్యర్థాల నిర్వహణకు షెడ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి వర్మీకంపోస్టును తయారు చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 570 ఎస్‌డబ్ల్యూపీసీ యూనిట్లు పూర్తయ్యాయని, వీటిని ఆయా పంచాయతీలకు మ్యాపింగ్ చేయాలన్నారు. సమావేశంలో పంచాయితీరాజ్ ఎస్‌ఈలు ఉమాశంకర్, గుప్తా, డీపీఓ శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొట్లాటకు దారితీసిన కుటుంబ వివాదం


చికిత్స పొందుతున్న గంగరాజు

పార్వతీపురం: కుటుంబంలో ఏర్పడిన చిన్నపాటి వివాదం కొట్లాటకు దారితీసింది. దీనికి సంబంధించి అవుట్‌పోస్టు పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలు... పార్వతీపురం మున్సిపాల్టీ జగన్నాధపురానికి చెందిన వి.గంగరాజు, తన వదిన కూతురు మహేశ్వరీకి సంబంధించిన కుటుంబ సమస్య పెద్ద మనుషుల మధ్య చర్చించుకుంటున్నారు. ఈ సమయంలో మహేశ్వరి భర్త సోమేశ్వరరావు తమ్ముడు ఎం.సతీష్ మధ్యలో వచ్చి దుర్భాషలాడి గంగరాజును పలుచోట్ల గాయపరిచాడు. ఈ ఘటనలో గంగరాజుకు ఎడమ కన్ను పైభాగంలో గాయమైంది. ఈ మేరకు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్యా యత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగిణి

పార్వతీపురం: భార్యాభర్తల మధ్య చిన్న వివాదం భార్య ఆత్మహత్యా యత్నానికి దారితీసింది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. పార్వతీపురం మున్సిపాలిటీ తాళ్లబత్తుల వీధికి చెందిన ఎస్‌కే నాగిణి తన భర్త మహమ్మద్ లతీఫ్‌తో కుటుంబ సమస్యల విషయమై గొడవ పడింది. ఈ వివాదంలో నాగిణిపై భర్త లేనిపోని మాటలు అనడంతో మనస్తాపానికి గురైంది. దీంతో ఇంట్లో ఉన్న ఎలుకల మందును తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు గమనించి నాగిణిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్య


మోహనరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

వీరఘట్టం: ఖాళీగా తిరిగే బదులు ఏదైనా పని చేసుకోవాలని కుటుంబ సభ్యులు చెప్పడంతో మనస్తాపానికి గురైన వీరఘట్టం గొల్లవీధికి చెందిన గార మోహనరావు(25) గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. ఏడాది క్రితం దేవి అనే యువతిని వివాహం చేసుకున్న మోహనరావు ఖాళీగా ఏ పనీ లేకుండా ఉండడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 6న మందలించారు. కుటుంబ సభ్యులు తనను నిలదీయడంతో మనస్తాపం చెందిన మోహనరావు ఈ నెల 6 సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మోహనరావును పాలకొండ ఏరియా ఆస్పత్రికి అక్కడ నుండి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మూడు రోజులుగా మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. మృతుని భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పి.కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీకొని నలుగురికి గాయాలు


బైక్‌లు ఢీకొన్న సంఘటనలో తలకు తీవ్ర గాయాలైన చింటు

కురుపాం: మండలంలోని గుజ్జుపాడు గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో శుక్రవారం నలుగురురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లే.. కెరడ గ్రామానికి చెందిన కె.చింటు, టి.కిరణ్, సాయి ఒకే ద్విచక్రవాహనంపై మొండెంఖల్ గ్రామం వైపు ఫొటో సూట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. కొరిశీల గ్రామానికి చెందిన పి.వినోద్ కురుపాంలో పామాయిల్ కంపెనీలో విధులకు వెళ్లా మధ్యలో అటవీ శాఖ వాహన డ్రైవర్ బి.అప్పారావు లిఫ్ట్ అడుగ్గా ఎక్కించి వస్తున్నాడు. గుజ్జుపాడు గ్రామ సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో కె.చింటు తలకి తీవ్ర గాయాలు కాగా, టి.కిరణ్ కాలికి తీవ్ర గాయమైంది. పి.వినోద్ చెయ్యి విరిగిపోగా, బి.అప్పారావు ముఖంపై గాయాలయ్యాయి. క్షతగాత్రులను కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి స్థానికుల వైద్యం కోసం తరలించగా మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కురుపాం ఎస్‌ఐ సి.హెచ్.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	60,650–00
బంగారం(22కే. 10గ్రా.)	55,600–00
వెండి (కిలో)	77,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹175	₹326	₹ 336

హోరాహోరీగా ఉమెన్ టీ 20 క్రికెట్ లీగ్ పోటీలు

- బెజవాడ బ్లేజర్స్ జట్టుపై వైజాగ్ డాల్ఫిన్స్ విజయం
- రాయలసీమ క్వీన్స్‌పై విజయనగరం రోయల్స్ గెలుపు


బెజవాడ బ్లేజర్స్ జట్టుపై విజయం సాధించిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు


రాయలసీమ క్వీన్స్ జట్టుపై విజయం సాధించిన విజయనగరం రోయల్స్ జట్టు

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఉమెన్ టీ – 20 క్రికెట్ లీగ్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. విజయనగరంలోని డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న పోటీల్లో భాగంగా శుక్రవారం బెజవాడ బ్లేజర్స్ – వైజాగ్ డాల్ఫిన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు 43 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించగా.. నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 177 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో రంగ లక్ష్మి 65 బంతుల్లో 115 పరుగులు, ఎం.దుర్గ 55 బంతుల్లో 54 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన బెజవాడ బ్లేజర్స్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 134 పరుగులు చేశారు. దీంతో వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు 43 పరుగుల తేడాతో విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో రాయలసీమ క్వీన్స్ జట్టుపై విజయనగరం రోయల్స్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడిన విజయనగరం జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించగా... నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేయగా... అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రాయలసీమ క్వీన్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 160 పరుగులు మాత్రమే చేయగలిగింది. రెండు మ్యాచ్‌ల్లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అతిథుల చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- పనులు పూర్తి చేయడంలో లక్ష్యాలు నిర్దేశించుకోవాలి
- 'నాడు – నేడు' డివిజన్ స్థాయి సమీక్షలో కలెక్టర్ నాగలక్ష్మి

చీపురుపల్లి: పేదలందరికీ సొంత ఇళ్లు ఇవ్వాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో చీపురుపల్లి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల అధికారులతో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాల్లో నిర్దేశిత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని పురోగతి సాధించాలని సూచించారు. లక్ష్యాలు చేరుకునేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అభివృద్ధి పనులపై వారంతపు లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో నాడు – నేడు పనుల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. మండలాల వారీగా అధికారులు, సచివాలయ ఉద్యోగులతో అంశాల వారీగా పురోగతిపై సమీక్ష చేపట్టారు. తాజాగా వచ్చిన కొత్త డీపీఆర్‌కు అనుగుణంగా పని చేయాలన్నారు. రాజాం నియోజకవర్గంలో 85 శాతం మాత్రమే లక్ష్యాలు చేరుకున్నామని వేగం పెంచాలన్నారు. తక్కువ పురోగతి సాధించిన గ్రామాల్లో మరోసారి అన్ని విభాగాల అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేయాలన్నారు. నాడు – నేడు పనుల్లో భాగంగా పనులు చేపడుతున్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అవసరమైన ఉపకరణాలు స్థానికంగానే కొనుగోలు చేసుకోవచ్చునని తెలిపారు. ఇండెంట్ పెట్టుకుని నిబంధనలు ప్రకారం వస్తువులు కొనుగోలు చేసుకుని పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డీఓ ఎం.అప్పారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రమణమూర్తి, డీఈఓ లింగేశ్వరరెడ్డి, అన్ని మండలాల ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖాధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

28న ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 28న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. స్త్రీ, పురుషులకు వేరువేరుగా శిక్షణ ఉంటుందని, పురుషులకు కంప్యూటర్ హార్డ్‌వేర్ (45 రోజులు), హౌస్ వైరింగ్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. స్త్రీలకు హోమ్ నర్సింగ్, కంప్యూటర్ బేసిక్స్ అండ్ టాలీ, లేడీస్ టైలరింగ్‌లలో 30 రోజులు శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో పాల్గొనాలని సూచించారు. శిక్షణ జూలై 1 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. శిక్షణా కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 8247732416, 9014716255, 9491741129, 9494952586 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నకిలీ డీఎస్పీపై కొనసాగుతున్న విచారణ

పార్వతీపురం: పోలీస్ శాఖలో ఉద్యోగాన్ని ఇప్పిస్తానని చెప్పి ఓ యువతి నుండి రూ. 2.70లక్షలు వసూలు చేసి ముఖం చాటేసిన నకిలీ డీఎస్పీ వ్యవహారంపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. యువత బలహీనతలను అడ్డం పెట్టుకొని ఇలాంటి మోసాలు నిత్యకృత్యమవుతున్నాయి. యువతి ఫిర్యాదు మేరకు ఫోన్ నంబర్ ఆధారంగా కొత్తవలసకు చెందిన వ్యక్తిని గుర్తించి పార్వతీపురం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నకిలీ డీఎస్పీని పోలీసులు విచారణ చేసి వాస్తవాలు బయటకు రప్పించే ప్రయత్నాలు ముమ్మరం చుస్తున్నారు. విచారణ అనంతరం పూర్తి స్థాయిలో విషయాలు బయటపడే అవకాశం వుందని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: కుటుంబ కలహాల నేపథ్యంలో బాత్రూమ్ క్లీనర్ తాగి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ స్థానిక గెంజిపేటకు చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కంటోన్మెంట్ గెంజిపేటలో నివాసం ఉంటున్న సోము గోవింద్ (43) రైల్వే కాంట్రాక్ట్ కూలీగా పని చేస్తుండేవాడు. నిత్యం కుటుంబంలో మనస్పర్థలు తలెత్తడంతో ఈ నెల 7న ఇంట్లో ఉన్న బాత్రూమ్ క్లీనర్ తాగాడు. వెంటనే అతన్ని కేంద్రాస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు.

కొనసాగుతున్న ధ్వజ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఎంబరేయ గుళ్ల గ్రామంలో 11వ శతాబ్దంలో నిర్మించిన అతి పురాతన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ధ్వజ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, యుక్త హోమం, క్షీరాదివాస, జలాధివాసం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తక్కువ వడ్డీపై డీసీసీబీ రుణాలు


మేరీమాత పాదుపు సంఘానికి రుణాన్ని అందజేస్తున్న డీసీసీబీ సీఈఓ జనార్దనరావు

- సీఈఓ జనార్ధనరావు

సీతానగరం: జిల్లాలో అన్ని వర్గాల వారికి వారి అవసరాన్ని గుర్తించి రుణాలు ఇవ్వడానికి జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్(డీసీసీబీ) సిద్ధంగా ఉందని, గృహ నిర్మాణదారులు, వర్తకులు, రైతులు వినియోగించుకోవాలని ఆ బ్యాంక్ సీఈఓ కె.జనార్దనరావు అన్నారు. డీసీసీబీ సీతానగరం బ్రాంచి కార్యాలయంలో సూరంపేట పంచాయతీ చిన్నారాయుడుపేట మేరీమాతా పాదుపు సంఘంలో చిరువ్యాపారాలు సాగిస్తున్న సభ్యులకు రూ.10 లక్షల రుణాన్ని శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా అన్ని తరగతుల వారికి తక్కువ వడ్డీపై రుణాలు సమకూర్చడానికి, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీపై రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. పెట్టీ రుణాలు, చిరు వ్యాపారాలు చేస్తున్న వారికి రూ.50 వేల నుండి రూ.లక్ష వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. రూ.2 నుండి 3 లక్షల రుణాలు కావలసిన వారికి 11.80 వడ్డీ పడుతుందన్నారు. వ్యవసాయ రుణాలు సమృద్ధిగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 7 శాతం వడ్డీపై స్వయం సహాయక సంఘాలకు రూ.3 లక్షల వరకు రుణాలు సమకూర్చడం జరుగుతుందన్నారు. రూ.3 లక్షల నుండి 5 లక్షల రుణాలు తీసుకున్న స్వయం సహాయక సంఘాలకు 5 శాతం వడ్డీ పడుతుందన్నారు. రూ.5లక్షల కంటే ఎక్కువ రుణాలు కావలసిన వారికి 9 శాతం వడ్డీ పడుతుందన్నారు. మిగతా జాతీయ బ్యాంక్‌ల కన్నా డీసీసీబీ బ్యాంక్ రుణాలపై వడ్డీ తక్కువన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, వర్తకులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆప్కాబ్ ఓఎస్‌డీ జీఎస్ఎన్ రాజు, సీతానగరం బ్రాంచి మేనేజరు వై.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు నలుగురి ఎంపిక


జాతీయ వాలీబాల్ పోటీలకు వెళ్లే జట్టులో జిల్లా క్రీడాకారులు, కోచ్‌లు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న వాలీబాల్ పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారుల ఎంపికయ్యారు. ఈ నెల 12వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగనున్న ఆల్ ఇండియా ట్రైబల్ వాలీబాల్ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టులోకి కురుపాం మండలం పాడిగూడ గ్రామానికి చెందిన పి.రాజశేఖర్, ఎ.మంగరాజులు, జీఎల్‌పురం మండలం మేదరగొడ గ్రామానికి ఎ.దిలీప్, పి.మల్లేష్ అర్హత సాధించారు. జాతీయ పోటీలకు వెళ్లేరాష్ట్ర జట్టుకు కోచ్‌గా బి.వైకుంఠరావు నియామకమయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు జిల్లా నుండి ఎంపికైన క్రీడాకారులకు జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షుడు గవర సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి టీవీ భగవాన్ దాస్ ,జిల్లా కార్యదర్శి కేవీఎఎస్ రాజు అభినందించారు.

బంగారం చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్


చోరీ వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర

వంగర: మండల పరిధి పటువర్ధనంలో పట్టపగలు జరిగిన బంగారం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర చోరీకి పాల్పడిన ఇమంది లక్ష్మణరావు, చుక్కల శివరావులను శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. వీరిద్దరు ఈ నెల 6వ తేదీన గ్రామానికి చెందిన చుక్కల చిన్నప్పమ్మ ఇంట్లో చొరబడి ట్రంకు బాక్సు తాళాలు పగులగొట్టి రెండు తులాలు బంగారం పుస్తెలతాడు, అర తులం చెవి రింగులు దొంగలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు క్లూస్ టీం సహాయంతో రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టి వారిని పట్టుకున్నారు. తామే దొంగిలించామని నిందితులు పోలీసులు ఎదుట ఒప్పుకున్నారు. వారి నుంచి దొంగిలించిన బంగారాన్ని రికవరీ చేశారు. దీంతో వారిద్దరినీ అరెస్ట్ చేసి పాలకొండ జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఎస్‌ఐ ఆర్.జనార్ధనరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రైల్వేలో ఉద్యోగాల పేరిట డబ్బుల వసూలు

కొత్తవలస : రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన ముఠాపై కొత్తవలస గ్రామానికి చెందిన ఎస్.రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుపై కొత్తవలస సీఐ ఎస్.బాలసూర్యారావు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ అందించిన వివరాలు... రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇపిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేసిన విశాఖపట్నానికి చెందిన ముఠా సభ్యులు కోటిపల్లి ప్రసాదరావు, సరళాదేవి, పద్మారావు, దేవిలపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ ముఠా సభ్యులు రాజేశ్వరి తన బంధువులు ఎస్.చంద్రశేఖర్, డి.శివ వద్ద ఆరు లక్షల రూపాయలు వసూలు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే విశాఖపట్నం జిల్లా పరిషత్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని శ్రీకాకుంళం జిల్లా వజ్రపుకొత్తూరుకి చెందిన ఎస్.మోహన్‌రావు వద్ద రూ.మూడు లక్షలు ఈ ముఠా సభ్యులు వసూలు చేసారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బాలసూర్యారావు తెలిపారు

గ్రీన్ ఎనర్జీ వైపు అడుగేద్దాం

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


బ్యాటరీ కారును ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ప్రతీ ఒక్కరూ పర్యావరణ హిత గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అందరి చేత శుక్రవారం ప్రతిజ్ఞ చేయించారు. గో ఎలక్ట్రిక్ గో గ్రీన్ నినాదంతో జిల్లా పరిషత్ ఆవరణలో నెడ్‌క్యాప్ ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాల ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, ఆటోలను, కార్లను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. వాహనాలను స్వయంగా నడిపి చూశారు. ఈ ప్రదర్శన గురించి, ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాల్సిన ఆవశ్యకతను, నెడ్‌క్యాప్ జిల్లా నిర్వాహకులు ఎం.వి.కె.రాజు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా విద్యుత్ వాహనాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. పెట్రోలు, డీజిల్ లాంటి సాంప్రదాయ ఇంధనాల వల్ల కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతోందని, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా దేశంలో గ్రీన్ ఎనర్జీ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే ఇటీవల రాష్ట్రంలో కూడా గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని పెంచే చర్యలను మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రారంభించారని, ఈ అంశంలో కూడా మన రాష్ట్రం ఎంతో ముందుందని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలంటే, ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీని కోసం జిల్లా పరిషత్ ఆవరణలో ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. నెడ్‌క్యాప్ జిల్లా నిర్వాహకులు ఎం.వి.కె.రాజు మాట్లాడుతూ, కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై అవగాహన కల్పించడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ పద్మావతి, జెడ్పీటీసీ గార తవుడు, జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, జెడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.